సాక్షి
ప్రకాశం
ఆదివారం | 3 | సెప్టెంబర్ | 2023



వైద్యశాలలో బాలింత మృతి

యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో బాలింత మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందిందంటూ మృతురాలి బంధువులు నిరసన తెలిపారు. - 8లో..



నిబద్ధతతో పనిచేయాలి

ఉపాధ్యాయులు నిజాయతీ, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38/29

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొత్తగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు



కంట్రోలు యూనిట్‌లు, బ్యాలెట్ యూనిట్లను గోదాములో దించుతున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: రాబోయే సాధారణ ఎన్నికల్లో వినియోగించేందుకు బెంగళూరులోని బెల్ కంపెనీ నుంచి జిల్లాకు కొత్తగా కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్‌లు వచ్చాయని డీఆర్‌ఓ శ్రీలత తెలిపారు. ఆ మేరకు శనివారం స్థానిక మామిడిపాలెం ఈవీఎం గోదాములో వాటిని భద్రపరిచారు. ప్రత్యేక వాహనంలో 5,440 కంట్రోలు యూనిట్‌లు, 1,250 బ్యాలెట్ యూనిట్‌లు బెంగళూరు నుంచి వచ్చాయి. వీటిని ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వాహనాల నుంచి దింపి గోదాములో భద్రపరిచారు. ఇప్పటికే జూలైలో 6,630 వీవీప్యాట్‌లు జిల్లాకు వచ్చిన సంగతి తెలిసిందే. డీఆర్వో వెంట వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, గుర్రం సత్యం, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



విక్టర్ ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న లక్ష్మానాయక్

ఒంగోలు: ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ ఒంగోలు నగరంలో గద్దర్ సంస్మరణ సభలో పాల్గొనేందుకు రాగా ఆయనను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్.లక్ష్మానాయక్ కలిసి ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎస్ఎస్‌పీ అతిథి గృహం వద్ద విక్టర్ ప్రసాద్‌ను కలిసి స్వాగతించారు.

- వాడవాడలా రాజన్నకు ఘన నివాళి
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ 14వ వర్ధంతి కార్యక్రమాలు
- ఒంగోలులో నివాళి అర్పించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- జిల్లాలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు, అన్నదానాలు
- ఒంగోలులో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె, ఎంపీ మాగుంట



చర్చి సెంటర్‌లోని వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావు తదితరులు

ప్రతి మది.. మహానేత గురుతు..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జన హృదయ నేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డికి జిల్లా ప్రజలు నీరాజనాలు అర్పించారు. ఆ మహానేత 14వ వర్ధంతి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. మారు మూల గ్రామాల్లో సైతం వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నీరాజనాలు పలికారు. పేద, బడుగు వర్గాలకు ఆశాదీపమైన డాక్టర్ వైఎస్సార్‌ను స్మరించుకుంటూ వర్ధంతి ఘనంగా జరుపుకున్నారు. అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఒంగోలులో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకటరావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో కలిసి తొలుత పార్టీ కార్యాలయంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రకాశం భవన్ ముందు ఉన్న వైఎస్సార్ భారీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పక్కనే ఉన్న వైఎస్సార్‌తో పాటు హెలికాప్టర్ ప్రమాదంలో అశువులు బాసిన ఆయన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జాన్ వెస్లీ విగ్రహానికి కూడా పూల మాలలు వేసి మాజీ మంత్రి బాలినేని నివాళులర్పించారు.



వెస్లీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాగుంట, బాలినేని, శిద్దా తదితరులు

- గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. రాచర్ల గేటు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఆయనతో పాటు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్యతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.
- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి పలు కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. మార్కాపురం పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు షంషేర్ అహమ్మద్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.
- సంతనూతలపాడు నియోజకవర్గంలోని చీమకుర్తిలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఆమె తనయుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డిలు వైఎస్సార్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.
- కొండపి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబు సింగరాయకొండ, టంగుటూరు, కొండపి, మర్రిపూడి మండలాల్లో పర్యటించారు. సింగరాయకొండలోని కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఒంగోలు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో మాతా శిశు వైద్యశాలలో రోగులకు బాలినేనితో పాటు పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం. ప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు కఠారి శంకర్, యువ నాయకులు బాలినేని ప్రణీత్ రెడ్డి, జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, దామరాజు క్రాంతి కుమార్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ఒంగోలు సబర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. నగరంలోని గద్దలగుంటలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రధానంగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి జిల్లా వైద్యశాలకు వెళ్లకుండానే ప్రాథమిక స్థాయి వైద్యాన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలోనే చేయించుకునేలా ఏర్పాట్లు చేసిందన్నారు. అనంతరం గద్దలగుంట బొమ్మల సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసిన నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మేయర్ గంగాడ సుజాత, యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డి, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనా కుమారి వెంకట్రావు, పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, నాయకులు కఠారి శంకర్, గోలి తిరుపతిరావు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ రావు, వేమూరి సూర్య నారాయణ, కార్పొరేటర్లు తాడి కృష్ణలత, ఈదర సురేష్ బాబు, యనమల నాగరాజు, చల్లా తిరుమల రావు, ఎందేటి పద్మావతి రంగారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ సుజాత

ర్యాగింగ్ రహితంగా మెడికల్ కాలేజీ ఉండాలి

- విలువలు, సంస్కారంతో విద్యార్థులు మెలగాలి
- అడిషనల్ జిల్లా జడ్జి రాజా వెంకటాద్రి

ఒంగోలు అర్బన్: ర్యాగింగ్ రహిత కాలేజీగా ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండాలని అడిషనల్ జిల్లా జడ్జి రాజా వెంకటాద్రి ఆకాంక్షించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో శనివారం నిర్వహించిన ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైద్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. చట్టాలు ప్రజల్లో మార్పు తెచ్చేందుకేనని అన్నారు. వైద్య విద్యార్థులు సంస్కారం, ఉన్నత విలువలతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్‌ను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని చెప్పారు. వరకట్నం నిషేధం, బాల్య వివాహాల నిర్మూలన చట్టాల అమలు ప్రజల్లో మార్పు రానిదే కష్ట సాధ్యమన్నారు. అదేవిధంగా విద్యార్థుల్లో మార్పు వస్తేనే ర్యాగింగ్ రహిత కాలేజీలు సాధ్యమన్నారు. విద్యార్థులు చట్టాలను అవగాహన చేసుకుని ర్యాగింగ్ పేరుతో ఇబ్బందులు తెచ్చుకోకుండా ఉండాలన్నారు. న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి శ్యామ్‌బాబు మాట్లాడుతూ ర్యాగింగ్ గురైన వారు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కాలేజి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సాయి బాబు, సీనియర్ న్యాయవాది రామ్మూర్తి, మానసిక నిపుణులు ఇస్మాయిల్, రిటైర్డ్ ఎంఐఓ జ్యోతి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జిల్లా జడ్జి రాజా వెంకటాద్రి

వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యం

- ఆయన జీవించి ఉంటే రాష్ట్ర విభజన జరిగేదే కాదు
- మహానేత హయాంలో జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం
- వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో మాజీమంత్రి బాలినేని



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, ఎంపీ మాగుంట, జంకె, మేయర్ గంగాడ

ఒంగోలు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం వైఎస్సార్ కాంస్య విగ్రహానికి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకట రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక చర్చిసెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి, అదే విధంగా వైఎస్సార్‌తోపాటు హెలికాప్టర్‌లో ప్రయాణిస్తూ అమరులైన అద్దంకి సాల్మన్ కేరీ వెస్లీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ జీవించి ఉంటే రాష్ట్రం విడిపోయేదే కాదని, రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందేదన్నారు. జిల్లాలో ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన ఘనత వైఎస్సార్‌దే అన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే కందుల ఓబుల్‌రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు, మాగుంట సుబ్బరామిరెడ్డి రామతీర్థం రిజర్వాయరు, ఉలిచి చెక్‌డ్యాం, ఒంగోలు రిమ్స్ ఆస్పత్రులు పూర్తిచేసుకుని ప్రారంభించుకోగలిగామన్నారు. పశ్చిమ ప్రకాశం దాహార్తిని, సాగునీటిని తీర్చేందుకు వెలిగొండ ప్రాజెక్టును తలపెట్టింది వైఎస్ఆర్‌దే అన్నారు. ఆయన ఆశయాల సాధనలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్య దళారీ అనేది లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తుండడం హర్షణీయం అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 108, 104, రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పార్టీలకు అతీతంగా వైఎస్సార్‌ను ప్రజల హృదయాల్లో నిలుపుకునేలా చేశాయన్నారు. నేడు ఆయన ఆశయాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరం అండగా ఉందామని పిలుపునిచ్చారు. సీఎం జగన్ ప్రవేశ పెడుతున్న విప్లవాత్మక సంక్షేమ పథకాలు పేద ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకువెళుతున్నాయన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ మానవతా దృక్పథంతో పేదలకు నివేశనస్థలాల పంపిణీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టును కూడా వేగవంతంగా పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించి వైఎస్సార్ పట్ల విశ్వాసాన్ని చాటుకుందామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్‌సీపీ యువనాయకులు బాలినేని ప్రణీత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ శింగరాజు మీనా వెంకట్రావు, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పార్టీ నగర కన్వీనర్ కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, సాంస్కృతిక విభాగం, మహిళా విభాగం, మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జులు బొట్ల సుబ్బారావు, బడుగు ఇందిర, సయ్యద్ జలీల్, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ పురిణి ప్రభావతి, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, వడ్డెర సంఘం అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, ఓబుల్‌రెడ్డి, దేవరపల్లి అంజిరెడ్డి, రాయపాటి అంకయ్య, బైరెడ్డి అరుణ, చింతగుంట్ల సువర్ణ, కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, కావూరి సుశీల, లీలాకుమారి, గోవర్ధన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, మీరావలి, కొమ్ము సామేలు, గంథం సామేలు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు ఘన నివాళి అర్పించారు.

సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించిన సీఎం



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, అధికారులు

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజలు మెచ్చేలా అద్భుతమైన పాలన ద్వారా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం నడిగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేసేలా సంక్షేమ పథకాలు అందించి, అభివృద్ధి పథాన ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తుంటే విమర్శిస్తున్న ప్రతిపక్షాలు గతంలో జన్మభూమి కమిటీల పేరుతో రాజకీయాలు చేశారని, పేదల సంక్షేమాన్ని గాలికొదిలిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని విమర్శించారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నామని అన్నారు. సంక్షేమాన్ని ఎద్దేవా చేసినవారు తిరిగి ఈ పథకాలను కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేడు ప్రభుత్వం ద్వారా ప్రారంభించిన పథకాలన్నీ మధ్యవర్తి ప్రమేయం లేకుండా లబ్ధిదారుల ఖాతాలకు జమచేస్తున్నారని అన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అన్నారు. వలంటీర్ల సేవకు వారికి గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా పురస్కారాలను, నగదు పారితోషికాలు అందిస్తున్నారని చెప్పారు. ఏదైనా సంక్షేమ ఫలాలు అందలేదంటే వెంటనే సంబంధిత సిబ్బందిని కలిసి తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. గడప గడపలో సంక్షేమ పథకాలపై వివరించారు. ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ వారికి అందించిన పథకాలను స్వయంగా వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి, ఏఓ కే నీరజ, ఏపీవో సుజాత, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, కోటయ్య, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు.

జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శిగా వై.వెంకట్రావు

ఒంగోలు: జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు (డీసీఈబీ) కార్యదర్శిగా వై.వెంకట్రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా పనిచేస్తున్న డి.వెంకారెడ్డి వద్ద నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం వెంకట్రావు పాదిలి మండలం పి.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయ సంఘాల నాయకులు నరహరి అంజిరెడ్డి, చల్లా శ్రీనివాసులు, శేషారెడ్డి తదితరులు పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు.



వై.వెంకట్రావును అభినందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


ఒంగోలులోని విశ్వసేవిక వృద్ధాశ్రమంలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మేయర్ గంగాడ, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు


చీమకుర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

మహానేతకు నివాళి

మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్, ప్రకాశం


హైదరాబాద్‌లో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్


మార్కాపురంలోని పాత బస్టాండ్ సెంటర్లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, నాయకులు


గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు


ఇడుపులపాయలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


జరుగుమల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గేరా నివేదిత

టంగుటూరు: వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసిస్టెంట్ బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న గేరా నివేదిత రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి అవార్డు అందుకోనున్నారు. గేరా నివేదిత రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అకాడమిక్ పాఠ్య పుస్తకాల రచన కమిటీలో సభ్యులుగా పని చేస్తున్నారు. బయోలాజికల్ సైన్స్ పుస్తకాలు రచన భాగమై ఉన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రచురించిన మన కోసం మన చట్టం అనే పుస్తక రచనలో పాలు పంచుకున్నారు. గతంలో కూడా రాష్ట్ర, జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టుల్లో విద్యార్థులను విజేతలుగా నిలిచేలా చేశారు. గేరా నివేదితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రమణయ్య, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.


గేరా నివేదిత

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

కంభం: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన కంభం పట్టణంలోని మెయిన్ బజారులో శనివారం ఉదయం జరిగింది. స్థానిక చౌక్ సెంటర్‌లో రాజా జ్యూయలరీస్ నిర్వాహకుడు సోమిశెట్టి రాజాకు భీమవరంకు చెందిన సోమరాజు, ఆదిలక్ష్మిల కుమార్తె సోమిశెట్టి జయతో (30) పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శనివారం ఉదయం సోమిశెట్టి జయ ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు కంభం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. జయ ఆత్మహత్య చేసుకుని ఉండదని, ఆమె మృతిపై అనుమానాలున్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఇద్దరు పిల్లలకు న్యాయం చేయాలని వాపోయారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు.


మృతిచెందిన జయ


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేకువ జామున చోరీ

● 35 వేలతో దొంగలు పరార్

జరుగుమల్లి: మండలంలోని నందనవనం గ్రామంలో వెంకటేశ్వరస్వామి బజారులో శనివారం తెల్లవారు జామున దొంగతనం జరిగింది. జొన్నలగడ్డ లక్ష్మీనరసయ్య భార్యతో పాటు ఇంట్లోని బెడ్ రూమ్ లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వారిరువురూ ఇంటి వెలుపల ఉన్న మరుగుదొడ్డిలోకి వెళ్ళి కాలకృత్యాలు ముగించుకొని మరలా ఇంటి లోకి వెళ్ళారు. తెల్లవారు జామున నాలుగు గంటల సమయంలో దొంగలు చాకచక్యంగా ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచి ఉంచిన రూ. 35 వేలు తస్కరించారు. అనంతరం అనూష మెడలో ఉన్న బంగారు తాళిబొట్టు తాడు లాగగా ఆమె గట్టిగా పట్టుకొని కేకలు వేసింది. దీంతో దొంగలు ఆమెను వదలి పారిపోయారు. క్లూస్ టీం పరిశీలించి వెళ్లింది. జరుగుమల్లి ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


బాధితులను విచారిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● చోరీ కేసును ఛేదించిన పోలీసులు

మేదరమెట్ల: పలు దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం కొరిశపాడు పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆ వివరాలు వెల్లడించారు. కర్ణాటకకు చెందిన కొరవర హనుమంతప్ప అదే రాష్ట్రం కనకగిరి గ్రామానికి చెందిన దారొజీ రాజా సాహెబ్‌తో కలిసి చోరీలకు పాల్పడుతున్నాడు. గత నెల 26వ తేదీ కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో ఇంటికి తాళాలు వేసి కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి బంగారు, వెండి ఆభరణాలు దొచుకుపోయారు. ఈ చోరీకి పాల్పడిన అంతర్ రాష్ట్ర దొంగలిద్దరినీ స్థానిక పైలాన్ సమీపంలో అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1.5 లక్షల విలువగల బంగారు, వెండి ఆభరణాలను రికవరీ చేసినట్లు చెప్పారు. వీరు పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. చోరీ జరిగిన తర్వాత వారం రోజుల్లోనే కేసును ఛేదించినందుకు చీరాల డీఎస్పీ ప్రసాదరావు, రూరల్ సీఐ ఆర్.ఉమేష్, ఎస్ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. కేసులో బాధితురాలైన పాతూరి లక్ష్మి పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.


చోరీలకు పాల్పడిన నిందితులు


జొన్న నాము తిని పది బర్రెలు మృతి


● రూ.8 లక్షల నష్టం

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ పంచాయతీ నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్.రామాంజనేయరెడ్డి బర్రెలు పది శనివారం ఉదయం పొలానికి వెళ్లి జొన్న నాము తిని అక్కడికక్కడే మృతి చెందాయి. ఇటీవల పొలాల్లో జొన్న సాగు చేశారు. వర్షాలకు మొలకెత్తిన జొన్న తిని బర్రెలు మృతి చెందడంతో సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.


మృతిచెందిన బర్రెలు

ఆర్టీసీ బస్సు.. కారు ఢీ


ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు


ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు

● జూనియర్ అసిస్టెంట్ మృతి

మార్కాపురం రూరల్: ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న సంఘటన మార్కాపురం మండలం తిప్పాయపాలెం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గిద్దలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మార్కాపురం నుంచి నంద్యాల వెళుతోంది. గిద్దలూరు నుంచి మార్కాపురం వైపు వస్తున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కారులో ఉన్న పంచాయతీ రాజ్ శాఖకు చెందిన జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న చింతగుంట్ల నాగేశ్వరరావు (43) అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన సింగరాయకొండ నుంచి శుక్రవారం మార్కాపురం పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించి కుటుంబ సభ్యులు గిద్దలూరులో ఉండటంతో గిద్దలూరు వెళ్లి శనివారం ఆఫీసుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. భార్య ఉషారాణి గిద్దలూరులో ఉపాధ్యాయినిగా పని చేస్తోంది. ఈయనకు ఇద్దరు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

చీరాల: గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చీరాల–ఒంగోలు బైపాస్ రోడ్డుపై స్థానిక మన్నం అపార్టుమెంట్ వద్ద చోటుచేసుకుంది. వేటపాలెం మండలం సమైక్యనగర్‌కు చెందిన యలవర్తి క్రాంతి (30) ద్విచక్రవాహనంపై చీరాల నుంచి వేటపాలెం వెళ్తున్నాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న జవాన్లు

జే పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ నూతలపాటి సుధీర్ కుమార్ (38)కు అధికార లాంఛనాలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. 2012లో సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా బాధ్యతలు చేపట్టి జమ్మూకాశ్మీర్‌లో సుధీర్ కుమార్ విధులు నిర్వర్తిస్తున్నాడు. సెలవుపై ఇంటికొచ్చి రెండు రోజుల క్రితం తన భార్య స్వగ్రామమైన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు వెళ్లారు. అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. బంధువులు సుధీర్‌ను గుంటూరు వైద్యశాలకు ప్రైవేటు వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. సుధీర్ మృతదేహాన్ని శనివారం స్వగ్రామం అలవలపాడు తీసుకొచ్చారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సుధీర్ మృతదేహానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పాకల సముద్రతీరంలో సోనాబోట్ల హల్‌చల్

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్రతీరంలో శనివారం ఉదయం తమిళనాడు రాష్ట్రం కడలూరు ప్రాంతానికి చెందిన సోనా బోట్లు హల్‌చల్ చేశాయి. సముద్ర తీరప్రాంత నిబంధనలకు వ్యతిరేకంగా సోనా బోట్లు సముద్ర తీరానికి అతి దగ్గరలో చేపల వేట సాగించాయి. గతంలో సోనా బోట్లు సుమారు 7 వరకు వస్తుండగా ఈసారి మాత్రం 10 బోట్లు వచ్చాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 15వ తేదీ చేపల వేట నిషేధం పూర్తయిన తరువాత ఈరోజు వరకు చేపల వేట ఆశాజనకంగా లేక బోట్లు తీరానికి పరిమితం అయ్యాయని ఇప్పుడు సోనాబోట్లు వచ్చి ఉన్న కాస్త సంపదను తుడిచి పెట్టుకుని పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి సోనాబోట్లు నిబంధనల ప్రకారం చేపల వేట సాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సింగరాయకొండ: పాకల సముద్రతీరంలో తీరానికి దగ్గరగా వేటాడుతున్న సోనా బోట్లు

ఏరియా వైద్యశాలలో బాలింత మృతి


నాగలక్ష్మి మృతదేహంవద్ద విలపిస్తున్న బంధువులు


ఆందోళన కారులతో మాట్లాడుతున్న సీఐ మారుతీకృష్ణ

● ఆందోళనకు దిగిన మృతురాలి బంధువులు

యర్రగొండపాలెం: స్థానిక ఏరియా వైద్యశాలలో బాలింత మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ ఆమె బంధువులు శనివారం వైద్యశాల ఎదుట హైవేపై రాస్తారోకో చేశారు. పల్నాడు జిల్లా సిరిగిరిపాడు మండలంలోని దావుపల్లికి చెందిన నాగలక్ష్మి కాన్పు కోసం శుక్రవారం వైద్యశాలలో చేరింది. రాత్రి ఆమెకు గైనకాలజిస్ట్ ఆపరేషన్ చేసి శిశువును బయటకు తీశారు. శిశువు పరిస్థితి బాగాలేక పోవడం వలన మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. నాగలక్ష్మిని వైద్యశాలలోనే ఉంచి వైద్యం చేస్తున్నారు. రాత్రికి ఆమె లోబీపీకి గురై మృతి చెందింది. ఈ విషయాన్ని వైద్యులు వెంటనే తమకు తెలియనీయకుండా జాగ్రత్త పడ్డారని, కేవలం డాక్టర్ నిర్లక్ష్యంతోనే నాగలక్ష్మి మృతి చెందిందని ఆమె బంధువులు ఆరోపించారు. ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వైద్యశాల ఎదుట ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. సీఐ కె.మారుతీకృష్ణ, పుల్లలచెరువు ఎస్సై శ్రీహరి సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమించుకోవాలని కోరినప్పటికీ శాంతించలేదు. ఒక సందర్భంలో వారు వైద్యశాలపైకి దాడి చేసేందుకు ప్రయత్నించారు. వైద్యశాల సూరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాన్పుఅయిన తరువాత నాగలక్ష్మి ఆరోగ్యం బాగానే ఉందని, కాన్పు చేసిన వైద్యురాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వచ్చారని, అనుకోకుండా ఆమె లోబీపీకి గురయి మృతి చెందిందని తెలిపారు. డాక్టర్ల నిర్లక్ష్యం ఏమాత్రంలేదని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలి


డిప్యూటీ ఈఓకు సూచనలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

● ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

కురిచేడు: ఉపాధ్యాయులు నిజాయితీ, నిబద్ధతతో పనిచేసి విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. స్థానిక వైఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ఏనెలలో చెప్పాల్సిన పాఠాలు ఆ నెలలో పూర్తి చేయాలని, బైజూస్ గురించి పూర్తిగా అవగాహన కలిగించాలని సూచించారు. టోఫెల్ పరీక్షలకు ప్రతి ఒక్కరినీ సిద్ధం చేయాలన్నారు. ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు దీటుగా.. భారత్‌లో ఎక్కడా లేని విధంగా కేవలం ఏపీలో ట్యాబ్‌లు ఇచ్చిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి రూపాయి ఉపయోగపడాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ వలంటీర్లతో మాట్లాడారు. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా మండలంలో అధికారులు, వలంటీర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ సుబ్బారావు, ఆర్డీఓ టి. అజయ్‌కుమార్, ఎంఈఓ ఆర్. వస్త్రాం నాయక్, ఎంపీడీఓ వసంతరావు నాయక్, తహసీల్దార్ జ్వాలా నరసింహం పాల్గొన్నారు.